# పాత్రలు కావలెను

నేను పత్రికలో వేసిన ప్రకటనను చాలామంది తప్పుగా అర్థంచేసుకున్నట్టు కనబడుతుంది.

శేషు నన్ను చూసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ, 'పత్రికలో చూశాలే! ఏమిటి నీక్కూడా ఇలా పుట్టుకొచ్చింది!' అంటూ జవాబు కోరని ప్రశ్నవేశాడు.

వాడంటున్న దేమిటో నాకు సరిగా అర్థం కాలేదు.

'నా క్కూడా ఏం పుట్టుకొచ్చిందంటావు?' అని అడిగాను.

'ఇంకేముంది? సినిమాలు తీసే జబ్బు!' అన్నాడు శేషు.

'నేను సినిమా తియ్యట మేమిటి? అదేం లేదే?' అన్నాను.

ముసి ముసి నవ్వు ఫేడౌట్ చేసేసి, 'మరి ఆ ప్రకటన ఏమిటి? అది వేయించింది నువు కాదా ఏం, కొంపదీసి?' అన్నాడు.

'నేనే, నేనే! దాన్ని నువు సినిమా హీరో తండ్రి లాగా అపార్థం చేసుకున్నావు.'

పత్రిక తీసి వాడి ముఖాన పెట్టి, 'ఈ ప్రకటనలో నేను సినిమా తీయబోతున్నానని ఎక్కడుందో చూపించు' అని శేషును ఛాలెంజి చేశాను.

శేషు నా ప్రకటనను చాలాసేపు చూసి, చిరాగ్గా తల ఆడిస్తూ, 'నువు సినిమా తీయబోతున్నట్టు ఇందులో లేదు. నిజమే. కాని, అటువంటి ఉద్దేశం లేనివాడివి ఈ ప్రకటన ఎందుకు వేశావూ? వీధి వెంట వెళ్ళే ఎవడికైనా ఈ ప్రకటన చూపించు. నేనువద్ద పొరపాటే వదకపోతే చెవి తెగ్గోయించుకుంటాను' అన్నాడు.

నువ్వన్నదీ నిజమేనేమో! రోజూ ఇన్ని లక్షల మంది పత్రికలు చదువుతారా? వాళ్ళు పత్రికల్లో ఉన్నదే చదువుతారని ఏమీ లేదు. ఎవరికి కావలసింది వాళ్ళు చదువుకుంటారు. సృజనాత్మక రచన తగ్గిపోయేకొద్దీ సృజనాత్మక పఠన జాస్తి కావటం జరుగుతుందో ఏమో? మోడరన్ ఆర్టు మాటేమిటి? అందులో ఎవరికి కావలిసిన మహోన్నత భావాలు వారికి కనిపిస్తాయి. కాని దానికి మనమేం చెయ్యగలం? అన్నాను.

'ఈ సోది అంతా నా కెందుకు గాని, ఈ ప్రకటన ఎందుకు వేశావో చెప్పు' అన్నాడు శేషు.

నేను చెప్పలేదు. 'డబ్బెక్కువుండి వేశాను పొ'మ్మని వాడి ప్రశ్నను దాటేశాను.

ఎందుకంటే, నా క్కావలిసింది శేషు ఇవ్వలేడు, సినిమాకు పనికొచ్చే పాత్రలు నాక్కావాలి, వాటిని డబ్బిచ్చి కొనుక్కుని నేనో కథ రాసి ఏ ప్రొడ్యూసరుకైనా అమ్ముకుంటాను. అది నా బిజినెస్. సినిమాకు పనికివచ్చే పాత్రలు సప్లయి చెయ్యటం శేషువల్ల అవుతుందా? వంటకు పనికివచ్చే పాత్రలు కూడా వా డివ్వలేడు.

ఊరంతా వెళ్ళే దారిన వెళ్ళని ఉలిపికట్టె కష్టాలు కొని తెచ్చుకుంటుంది కాబోలు. నేను చిక్కుల్లో పడ్డాను.

నా ప్రకటనకు జవాబుగా ఉత్తరాలు దిగసాగాయి. మొదటి రోజు అయిదారే వచ్చాయి. దానికే ఆశ్చర్యపడిన నేను ఆటు తరవాత వచ్చిన కట్టలుచూసి ఏం చెయ్యాలో తేల్చుకోలేక పోయాను. మొదటి రేసులోనే డబ్బంతా పోగొట్టుకున్నవాడి చందమయింది నాది.

అయిదో రోజు పోస్టమన్ ఇంత పెద్ద కట్ట తెచ్చి నా చేతికిచ్చాడు.

ఆ ఉత్తరాలన్నీ నావేనా?' అన్నాను.

'మీవి కానివి ఒకటీ అరా ఉంటే వేరే వుంచండి, నేను రేపు వచ్చినప్పు డిచ్చేద్దురు గాని' అన్నాడు పోస్టమన్.

ఈ పోస్టుతో నాకూ, మా ఆవిడకూ చేతినిండా పని.

అసలు ట్రాజెడీ ఏమిటంటే, అన్ని వేల ఉత్తరాలలోనూ ఒక్కటి కూడా నా ప్రకటనకు సమాధానం కాదు.

శేషు చెప్పినట్టు, నేను సినిమా తియ్యబోతున్నానని చాలా మంది అనుకున్నారు. ఉత్తరాలలో అధిక భాగం వేషాలకు దరఖాస్తులు. నా కదివరకు తెలీదు — దేశంలో అచ్చు ఎన్టీ రామారావల్లేనూ, అక్కినేని నాగేశ్వరరావల్లేనూ, శోభన్‌బాబల్లేనూ ఉండేవాళ్లు చాలా మంది ఉన్నారు. వాళ్ళలో కొందరు అతి చిన్న వేషమైనా వెయ్యటానికి సిద్ధంగా ఉన్నారు. కొందరు ఫోటోలు పంపారు.

ఆడపిల్లల నుంచి కూడా అప్లికేషన్లు వచ్చాయి. వాళ్ళంతా కాన్వెంట్లలో చదివినట్టు కనబడ్డారు. హిందీ, అరవమూ, కన్నడమూ, మళయాళమూ, ఇంగ్లీషూ, ఫ్రెంచీ, బెంగాలీ, రష్యనూ, సింహలీజ్, జర్మను వగైరా భాషలు ఎన్నో వచ్చినవాళ్ళున్నారు.

అమ్మాయిల్లో కొందరు సినిమా అవకాశం ఇప్పించినట్టయితే స్వేచ్ఛగా నటించటానికీ, ఎలాటి దుస్తులైనా ధరించటానికీ, తమకు అదివరకే వచ్చిన భరత నాట్యమూ, కథాకళీ, మణిపురీ, కథక్, రాకన్రోల్, ట్విస్ట్ వగైరా డాన్సులే గాక కొత్త రకాలు నేర్చుకోవటానికి కూడా సిద్ధంగా ఉన్నట్టు రాశారు.

ఒకమ్మాయి, కోరిన పక్షంలో, బేతింగ్ డ్రెస్సులోనూ ఫొటో తీయించుకుని పంపించగలనన్నది.

ఇద్దరమ్మాయిలు తమ కొలతలు కూడా పంపారు.

చాలా మంది, నేను తీయబోని సినిమాకు కథలు పంపారు. ఎవరెవరు ఏయే పాత్రలు ధరించాలో వాళ్ళే చెప్పారు. నాకు కాస్టింగ్ శ్రమ కూడా లేదు.

కొందరు మరో రకం ఉత్తరాలు రాశారు. వాటికీ, నా ప్రకటనకూ ఏమి సంబంధమో తెలియలేదు. వాళ్లు నానుంచి ధన సహాయం కోరారు. తమ కష్టాలు చెప్పుకున్నారు. తమవంటి దీనులకు సహాయం చేసినట్టయితే నాకు భగవంతుడు అంతకు వెయ్యి రెట్లు దబ్బిస్తాడని నమ్మకంగా చెప్పారు. ఎలుకసెట్టి కథలో లాగా వాళ్ళే ఒక నయాపైసా ధర్మంతో ప్రారంభించి లక్షలు ఎందుకు ఆర్జించారు కారో మరి!

ఒక ఉత్తరం వచ్చింది. దాని మీద ఊరూ, పేరూ, తేదీ, సంతకమూ ఏమీ లేవు. ఆ ఉత్తరానికి ఇరవై నకళ్లు తీసి వెంటనే ఇరవై మందికి పోస్టు చెయ్యమనీ. అలా చెయ్యని పక్షంలో నాకు సర్వనాశనమవుతుందనీ, అలా చెయ్యని కారణం చేతనే నెహ్రూ, గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి ఆకస్మిక

మరణం పొందారనీ, అలా చెయ్యటం వల్లనే హుసేన్‌కు రాష్ట్రపతి పదవి, పి.సి. ఘోష్‌కు బెంగాలు ప్రధానమంత్రి పదవీ వచ్చిందనీ, ఇరవై నకళ్లు పంపినవారికి ఇన్‌కమ్ టాక్స్ తప్పుతుందనీ, అనుకోకుండా మంత్రి పదవులూ, పద్మశ్రీ వగైరా బిరుదులూ వస్తాయనీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇంటర్వ్యూలు విజయవంతమవుతాయనీ నేను తెలుసుకున్నాను.

తిరుపతికి వెళ్ళటంకన్న ఇదే బాగుంది. గుండు చేయించుకుని వికారం కానవసరం లేదు. అంతా రహస్యంగా జరిగిపోతుంది. పైకివచ్చి కమ్యూనిస్టుగా చలామణి అయేనాడు కూడా మరోడికి తెలీకుండా ఈ అస్త్రం ప్రయోగించవచ్చు!

'ఏమండీ, దీనికి మీరు పది నకళ్ళూ, నేను పది నకళ్ళూ తీద్దాం' అన్నది నా భార్య.

'ఒద్దు. నువ్వెన్ని అక్షరాల తప్పులు రాస్తావు. కళ్లు పోతాయి' అన్నాను.

మా ఆవిడ ఆ ఉత్తరం తీసి భక్తిగా పక్కన పెట్టింది.

'ఈ ఇన్లాండ్ లెటర్లూ, కవర్లూ, రిజిస్టర్లూ—లోకులు ఎన్ని వందల రూపాయలు ఖర్చు చేశారో! జనం దగ్గిర డబ్బుంది. పోస్టు ధరలు పెంచేస్తే ప్రభుత్వానికి బోలెడంత డబ్బొస్తుంది' అన్నది మా ఆవిడ.

'ఎంత పెంచితే బాగుంటుందంటావు?' అన్నాను.

'కార్డు పది పైసలు చెయ్యండి. ఇన్లాండు లెటరు పదిహేను పైసలు చెయ్యండి, కవరు పావలా చెయ్యండి....'

మా ఆవిడ అన్న మాటలు మొరార్జీ దేశాయికి ఎట్లా తెలిశాయన్నది గొప్ప మిస్టరీ. టెలిపతీ ఉన్నదనటానికి ఇంతకన్న మంచి రుజువు మరి దొరకదు.

నా ప్రకటన వెలువడిన పదో రోజున అసలు క్రైసిస్ వచ్చింది — మా ఇంటికే—ఒక ముప్పైఏళ్ళ స్త్రీరూపంలో.

ఆవిడ వచ్చే సమయానికి నేనింట్లో లేను. బాదరాయణ సంబంధం కథలోలాగా, ఆవిడ ఒక చేత సంచీ, ఇంకోచేత ప్లాస్టిక్ పెట్టె పట్టుకుని లోపలికి వచ్చి, 'చిల్లరంతా దిక్కుమాలిన పోర్టరు కాజేశాడు, సైకిల్‌రిక్షాకు ముందో అరవై పైసలు ఇచ్చేండి' అనగానే మా ఆవిడ నా తాలూకు బంధువనుకుని, డబ్బిచ్చి సైకిల్ రిక్షాను పంపేసి, క్రైసిసుకు కాళ్ళు కడుక్కునే నీళ్ళిచ్చి, తువాలిచ్చి వెర్రిమొహంలాగా 'ఇదేనా రావటం?' అని అడిగిందిట.

'కనిపించటంలేదూ?' అన్నదిట క్రైసిస్. అని ఊరుకుందా? మా ఆవిడ వంటి ఆడవాళ్ళు అధోగతిలో ఉండటంచేత మగాళ్ళు పెచ్చుమీరిపోతున్నారనీ,

తాను వచ్చి ఇంత సేపైనా మా ఆవిడ తన పేరూ, వచ్చినపనీ అడగలేదనీ ఎద్దేవా చేసిందిట

ఆవిడ క్రైసీసని అప్పుడు మా ఆవిడకి అర్థమయి, 'మీరు మా సవిత త్రగారు—అంటే మావారి సవిత్తల్లి—అనుకుంటున్నానండీ! కారా ఏమిటి కొంపతీసి? నేనావిణ్ణి చూశ్శేదనుకోండి. ఆవిడ ఫోటో చూశా. అచ్చు మీలాగే ఉంటారు' అని కసి తీర్చుకుంది.

క్రైసీసు ఆ దెబ్బతో ఒక్క-క్షణంపాటు 'అవాక్కు-' అయి ఊరుకుందిట.

ఇంతకూ ఆవిడ ఒక రచయిత్రి. ఆవిడకి పత్రికలంటే లవ్—హేట్ చాలా గాఢంగా ఉన్నది. ఆవిడ ఎన్నో నవలలు పోటీలకు పంపిందట. ఒక్క-దానికీ బహుమానం ఇద్చారుకారుట. కాని ఆవిడ రాసిన సీరియల్స్ వేసుకుంటారట.

నేనింటికి వచ్చేసరికి ఆవిడ గట్టిగా మాట్లాడుతూ పత్రికలను తిట్టిపోస్తూ, ఆ గుక్క-లోనే ఏయే పత్రికలవాళ్లు తన 'నోవెల్సు'ని కళ్ళకద్దుకు చేసుకున్నారో, ఏ పత్రికలో బొమ్మలు అచ్చు తను అనుకున్నట్టుంటాయో చెబుతున్నది.

'మా ఇందిరుంది చూడండీ? దాని బొమ్మని ఆర్టిస్టు చాలా బాహా, నే నూహించుకున్నట్టే వేశాడు' అంటున్నది క్రైసీసు.

'ఇందిరంటే మీ ఎన్నో అమ్మాయండీ?' అని మా ఆవిడ అమాయికంగా అడుగుతున్నది.

'ఇందిరంటే నేను రాసిన 'తెలుపు నలుపు వలపు' నోవెల్లో హీరోవిన్' అంటున్నది క్రైసీస్ కసిగా.

ఇంతలో నేను రానే వచ్చేశాను.

నేను ఫలానా అని తెలియగానే ఆవిడ ప్రాంప్ట్‌గా బిజినెస్‌లోకి దిగి, 'ఇదుగో, చూడండీ, అడ్డమైన రచయిత్రులూ సినిమాలకి రాసేస్తున్నారు. నాచేత మీరు రాయించుకోవాలి. మీరు డబ్బిస్తారనుకోండి. కాని డబ్బుకోసంకాదు నేను రాస్తానంటూంట. ప్రిస్టీజి! 'ఏవండీ, మీచేతెవరూ రాయించుకున్నారు కారే'వని అందరూ చంపేస్తున్నారు. ఈ రాసేవాళ్ళందరికన్నా బాగానే రాస్తాలెండి. నా 'కారుమేహం' నోవెలుంది చూశారూ, అది సినిమా కోసవని రాసిందేనూ! నన్నడిగితే 'తెలుపు నలుపు వలపు' కంటెకూడా గొప్ప సస్పెన్సు నోవెలది. నా 'తెలుపు నలుపు వలపు' లోంచి ఆ దిక్కు-మాలిన సినీమా కంపెనీవాళ్ళు అయిడియాస్ కొట్టేశారండి. రిజిస్టరు నోటీసిచ్చా. జవాబిచ్చారుకారు. దావా వేద్దామని ప్లీడరు నడిగితే నెగ్గదనేశాడు. అట్నుంచి కతికాదో ఏవిటోనూ!' అంటూ క్రైసీస్ నన్ను గంటా పదిహేన్నిమిషాలపాటు ఊదరబెట్టేసింది.

అంతా విని చల్లగా చావుకబురు బయటపెట్టాను.

'మీరు చెప్పేదంతా బాగానే ఉంది గానీండి, నేనసలు పిక్చరుతీసే ప్రయత్నంలో లేను. మానుకోవటంకాదు. ఏనాడూ నా ఉద్దేశం అదికాదు. మన సినిమాల్లో—మీరు చూసే ఉంటారు-'

నన్ను మాట్లాడనివ్వకుండా ఆవిడ అడ్డుతగిలి. 'నేనెప్పుడూ సినిమాలు దృష్టిలో పెట్టుకునే నోవెల్సు రాస్తాను. పత్రికలో వేస్తే మహా చదివితే నాలుగు లక్షలమంది చదివారు. సినిమాల్ని నలభై లక్షలమంది చూస్తారు. కోటిమంది చూస్తారు. రానిందానికి పర్పసుండాలి—ఏమంటారు? మనం జీవితంలో పొందనీ, పొందలేనీ అనుభూతుల్ని సాహిత్యంద్వారా పొందాలి. సినిమా లందుకేగదా ఉంటా? అంచేత నేఁవిటంటే, నేను ఎప్పుడూ సినిమాలే దృష్టిలో ఉంచుకుని రాస్తా' అన్నది.

'కాని మన సినిమాల్లో నటీనటులేతప్ప పాత్రలుంటంలేదు. ఆ లోటు తీరుద్దామని....'

'అక్కడే మీరు పొరపడుతున్నారు. అసలు పాత్రలు నటీనటులే. మన పంచపాత్రం దనుకోండి. అందులో నీళ్ళు పోస్తాం, పాలు పోస్తాం, పాయసం పోస్తాం, పానకం పోస్తాం. పాత్ర ఎప్పుడూ ఒకటే. మా ఇందిరను సృష్టించేప్పుడు నేను కృష్ణకుమారిని మనసులో ఉంచుకున్నాననుకోండి. ఇప్పు డాలోచిస్తే అది ఒకవేళ విజయనిర్మలా ఏఁవిటనిపిస్తోంది. అలాగే వరంధామయ్యున్నా డనుకోండి. గుమ్మడియే. నేనెప్పుడూ మన నటుల్నే మనసులో ఉంచుకొని పాత్రలు సృష్టిస్తాను. పాత్రలకీ, నటులకీ తేడా ఉంటం నేను యెంతమాత్రమూ ఒప్పుకోను' అన్నది క్రైసిస్.

నేను నోరు వెళ్ళబెట్టాను.

ఈవిడను ఎట్లా నోరు ముయ్యటం? ఎట్లా వదిలించుకోవటం?

ఆవిడ రోజల్లా గంట మోగుతున్నట్టు మోగుతూనే ఉంది. రాసే మగాళ్ళ నందర్నీ తిట్టింది. పెళ్ళాలనే అర్థం చేసుకోలేనివాళ్ళు ఆడపాత్రలను సృష్టించట మేమిటన్నది. నేను నాభార్యను ఎన్ని రకాల అవమానిస్తున్నానో తెలుసుకొనే టందుకు చాలా సటిల్‌గా ప్రశ్నలువేసింది. మగవాళ్ళకన్న ఏనాటికైనా ఆడ వాళ్ళే బాగా రాయగలరన్నది. అంటూనే మిగిలిన ఆడ రచయితలనందర్నీ ఏదో వంకపెట్టి తిట్టింది. 'కావ్యేషు నాటకం రమ్యం, నాటకేషు శకుంతలా' అన్నట్టుగా తెలుగుగడ్డకు క్రైసిస్ ఒక్కతే అసలైన రచయిత అయి కూర్చుంది!

ఆవిడ రాసిన నవలలూ, కథలూ అన్నీ మాకు కరతలామలకమై పోయాయి.

'ఎవరు నువ్వు?' అన్న అతిచిన్న నవల ఆవిడ మాస్టర్ పీసని మాకు అర్థమయింది. 'ఎవరు నువ్వు?' అని భార్య భర్తను అడగటంతో నవల ఎబ్రప్ట్‌గా ఆగిపోతుందిట. భార్య చెప్పిన చివరి డయలాగు నాకూ, మా ఆవిడకూ కంఠతా వచ్చేసింది.

'నేను సంగీతంలో సుశీలకుగాని, నాట్యంలో వైజయంతిమాలకిగాని, చిత్రలేఖనంలో అమృత షేర్గిల్‌కిగాని, నటనలో జమునకుగాని తీసిపోను. నాలో ప్రపంచం ఏమేమి చూచి కరతాళధ్వనులు చేసిందో వాటన్నిటికీ అంకు పెట్టావు. పవిత్రంగా ఉండవలిసిన మన ప్రేమను కామంతో పంకిలం చేశావు. నా అనుభూతులలో ఏ ఒక్కదాన్నీ నువ్వు పంచుకోలేదు. నా ఆలోచన ఒక్కటీ నీకు అర్థంకాదు. నా హృదయోద్రేకాలేవీ నిన్నంటవు. అయినా నామీద నీకింత అధికారం ఎవరిచ్చారు? అసలు-ఎవరు నువ్వు?' అంటుంది 'హీరోయిన్.'

'ఇంకో యాభై ఏళ్ళకి నా ఈ చిన్న నోవెల్ వెండితెర కెక్కి ప్రెసిడెంటు ఎవార్డు అందుకుంటుంది. అటువంటి రోజు వచ్చితీరాలి. వచ్చి తీరుతుంది' అన్నది క్రైసిస్.

ఆవిడకు ఆతిథ్యం ఇవ్వటం మా తలకి మించిన పని అయింది. ఆవిడ కొత్తస్టయిలు అతిథి. అన్నీ అడిగి చేయించుకుంది చక్కగా. భోజనంలోకి ఏమేం చెయ్యాలో చెప్పింది. మమ్మల్ని బజారుకు వెంటబెట్టుకెళ్ళి, తనకు కావలిసిన చిల్లర వస్తువులు కొనిపించింది. మేం చూశామన్నా వినకుండా, తాను చూడలేదు గనక, ఓ డొక్కు సినిమాకు మమ్మల్నికూడా ఈడ్చుకుపోయి, మాచేతనే బాల్కనీ టిక్కెట్లు కొనిపించింది.

మా ఇంట్లో తన పుస్తకం ఒకటి లేనందుకు మా సాహిత్యాభిలాషమీద సొద్దువేసింది.

'ఇంతకూ నా నోవెల్సులో ఏమేం తీసుకుంటారు?' అని నన్ను నిలదీసి అడిగింది.

ఏమీ తీసుకోనంటే చంపేస్తుందని నాకేదో భీతి కలిగింది.

'మీ పుస్తకాలు సంపాదించి చదివిచూసి నింపాదిగా తెలియబరుస్తాను' అన్నాను.

మర్నాడు మా క్రైసిస్ తిరిగి వెళ్ళిపోయింది,

మూడోనాడు ఇన్ని పుస్తకాల కట్ట వీపీగా వచ్చేసింది. దాన్ని తిప్పికొట్టటానికి మొహమాటపడి తీసుకున్నాను.

అప్పటినుంచీ వారంవారం ఉత్తరం! పుస్తకాలు చదవటం పూర్తయిందా? ఏమేం తీసుకుందామనుకుంటున్నారు?

ఏవేవో సమాధానాలు రాస్తున్నాను. ఇంకా కొన్ని పుస్తకాలు చదవాలని ఓసారి, నాకూ మా ఆవిడకూ అభిప్రాయాలు కలవటంలేదని ఓసారీ, పిక్చరు తీసే ఆశలేదని ఓసారీ, నాకు డబ్బు పెడతానన్నవాడు తిరపతి తోపిడిలో చచ్చాడని ఓసారీ రాస్తూ వస్తున్నాను

'పిక్చరు తీసిందాకా ఆగనవసరంలేదు. ముందు సినిమా రైట్స్ పుచ్చేసుకోండి. లేకపోతే ఇంకెవరన్నా ఈ అవకాశం కొట్టేగలరు' అని నా మేలు కోరి నన్ను హెచ్చరించింది మా క్రైసిస్.

ఈ ఉత్తరం వచ్చాక నాకో కొత్త ఐడియా వచ్చింది. నేను మా క్రైసిసుకు బ్రోకరుగా పనిచెయ్యదలిచాను. స్త్రీలచేతనే రాయించుకోవాలన్న పట్టుదలగల నిర్మాతలు నాకు రాయండి. నా దగ్గిర తొమ్మిది మహత్తరమైన నవలలున్నాయి. అన్నీ స్త్రీహస్త పాకాలే. బ్రోకరేజి ఆట్టే ఉండదు. తొమ్మిది నవలలూ తీసుకునే వారికి బ్రోకరేజి ఉచితం. ఇటువంటి సదవకాశాన్ని మన చిత్ర నిర్మాతలు సద్వినియోగం చెయ్యకపోతే అది నా ప్రారబ్ధం!

[ప్రచురణ: పెళ్ళి చెయ్యకుండా చూడు కథల సంపుటి, నవంబరు 1968 ప్రథమ ముద్రణ, ఎమెస్కో: మద్రాసు.]